# మా అమ్మ జీన్స్

## దుర్గమహంతి మోహనరావు

“అమ్మా... నా డ్యాన్స్ ప్రోగ్రామ్ చాలా బాగా జరిగింది ‘ది ప్రిన్సెస్ ఆఫ్ కూచిపూడి డ్యాన్స్’ అని అమెరికన్ న్యూస్ పేపర్స్‌లో రాసేరమ్మా. ఇక్కడున్న మన ఆంధ్రులే కాక వేలాది అమెరికన్స్ నన్ను అభినందించారు. ఈనాడు నేనందుకున్న అభినంద నలు నిజానికి నీకే చెందాలి.

నీలాంటి అమ్మ ఒడిలో గజ్జెకట్టి దేశవిదేశాల్లో ప్రముఖ కూచిపూడి నర్తకిగా పేరు ప్రఖ్యాతులు గడించా నంటే అది కేవలం నీ ప్రోత్సాహం మాత్రమే. అందుకు నేనెంతగానో ఋణపడి ఉన్నాను. ఈ మెయిల్లో కొన్ని ఫోటోలు పంపిస్తున్నాను. నేను మీ అల్లుడుగారు ఇప్పుడే ఎయిర్‌పోర్ట్‌కి వచ్చాం. రేపటికల్లా నీ ముందుం టాం. హౌ ఈజ్ పప్పీ? స్కూల్‌కెళ్ళిందా? ఓ.కె. మమ్మీ ఉంటాను. బై...’’ అమెరికా నుండి ఫోన్లో మాట్లాడింది కాత్యాయిని తల్లితో.

పరవశించిపోయింది ఆమె హృదయం.

మరో ఇరవైనాలుగు గంటల్లో కూతుర్ని అల్లుణ్ణి చూడబోతున్నాను అనే ఆనందం ఆమెముఖంపై స్పష్టంగా కనిపించింది. కాత్యాయిని కన్నతల్లిని ఊరుని విడచి అమెరికాలో కూచిపూడి నృత్య ప్రదర్శనకై టూర్ కెళ్ళి ఆర్నెల్లైనా ఆరు రోజుల్లా గడచిపోయాయి.

అందుకు కారణం ఈమెయిల్ ఉత్తరాలు, ఫోన్లో మంతనాలు అంతా పక్కవీధిలో ఉన్నట్లుగానే ఉంది ఈ రోజుల్లో. అదే యాభైఏళ్ళ క్రితం పక్కవూళ్ళో వున్నా ఉత్తరమో, మనిషో వస్తేగాని క్షేమసమాచారాలు తెలి సేవి కావు. యేభైఏళ్ళ పైబడ్డ సుందరమ్మ కూతురు వస్తున్న వార్త విని ఉత్సాహంతో ఆనందంగా టీవి ఆన్ చేసింది. టీవి కార్యక్రమాల్ని చూడ్డం అసంకల్పిత ప్రతీ కారచర్యగా తయారైంది ఆమెకు.

నేడు కాత్యాయిని ఖండాంతరాల్లోకూచిపూడి నృ త్యకళాకారిణిగా పేరు ప్రఖ్యాతులు గడించటానికి కారణం సుందరమ్మ. ఆమె చూపులు టీవి తెరపై నున్నా, మనసు మాత్రం ముప్పైయేళ్ళ నాటి జీవిత తెరల్లోకి తొంగి చూడసాగింది. గలగలపారే తల్లి గోదా వరి నది ఒడ్డున విసిరేసినట్టున్నాయి అక్కడక్కడ కొన్ని ఇళ్ళు. అక్కడికి దూరంగా నటరాజమందిరం. ఆ మందిరానికి పక్కవీధిలోనే ప్రముఖ నాట్యాచార్యులు రాఘవాచారి గారిల్లు. వారు కూచిపూడి కళామతల్లి సిగలో విరబూసిన పువ్వు. నాట్యంలో నిష్ణాగరిష్టుడు. వారి దగ్గర నాట్యం నేర్చుకునేందుకు ఆ ఊళ్ళో విద్యా ర్థులేకాక పొరుగురాష్ట్రాల నుండి కూడా వచ్చేవారు. రంగస్థలంపై స్త్రీలు తక్కువగా నటించే నాటి రోజుల్లో పురుషులే స్త్రీ పాత్రలు పోషించి వీధి నాటకాలు, వీధి బాగోతాలు వేసేవారు. ముఖ్యంగా దసరా, సంక్రాంతి పండుగలకి గ్రామకరణం వాకిటనో, పంచాయితీ కార్యా లయం దగ్గరనో ప్రదర్శనలు జరుపుతుండేవారు.

వేసవి కాలంలో చీకటి పడగానే చల్లని గాలి పీలుస్తూ పెద్దలు, పిన్నలు ప్రశాంత వాతావరణంలో ఈ కార్య క్రమాలు చూస్తుండేవారు. రాఘవాచారి గారి నృత్య బృంద ప్రదర్శనంటే పొరుగూరి నుండి కూడా ఎడ్ల బండ్లమీదో, గుర్రంబండ్లమీదో మరీ వచ్చేవారు. ఒకో సారి వీరిమధ్య పోటీ ప్రదర్శన్లు కూడా జరుగుతుండేవి. అలా వీధిబాగోతాలు ప్రదర్శనలిచ్చే బృందంలో చిన్న వేషాలు వేసే కళాకారిణి సుందరమ్మ. ఆమె భర్తకూడా కళాకారుడే.

సుందరమ్మకి పెళ్ళైన రెండేళ్ళకే భర్తకి ప్రమాదం జరిగి సంసార జీవితానికి దూరమయ్యాడు. ఫలితంగా సంతానంలేదు ఆ దంపతులకి. దేవీనవరాత్రల సంద ర్భంగా ‘మహారధి కర్ణ’ హరిదాసు చెప్పిన కథవిని ఉత్తే జితురాలైంది సుందరమ్మ. క్షేత్రజ సంతానం పొందటం ధర్మశాస్త్రవేత్తల నిర్ణయమేనని నిర్ధారించుకుంది. కుంతి

పాత్రలో ఆమెకున్న నటనానుభవం మరింత ఆకర్షిం చింది.

శరత్ ఋతువు నీలిమేఘాల ఒడిలో పూబంతిలా చంద్రుడు ప్రకాశిస్తున్నాడు. రాఘవాచారి ఏదో పుస్తక పఠనంలో నిమఘ్నమై వున్నారు. వారి వాకిట్లో అడుగుపెడితే నటరాజుని సిరిమువ్వల సవ్వడి ప్రతిధ్వనిస్తుంది.

''మాష్టారు...'' సుమధురమైన ఆమె పిలుపు విని తలెత్తి చూశాడు నాట్యాచార్యులు.ఏంకావాలి అన్నట్లు కళ్ళతోనే అభినయించాడు.

''నేనొక చిన్న కళాకారిణిగామీకు సుపరిచితమే''

అవును సుపరిచితమే 'భామాకలాపం'లో భామనే... సత్యభామనే... అంటూ వయ్యారంగా వాలుజడని చేత్తో తిప్పుతూ జఘన సౌందర్యాన్ని కదిలిస్తూ కలువ కళ్ళతో కవ్వించేది. పెట్రోమాక్స్ దీప కాంతిలోనే అద్భుతమైన ఆమె రూపలావణ్యాలని చూసి ముగ్ధులయ్యేవారు ప్రేక్షకులు. సత్యభామలో చూడని వయ్యారాలు ఆమె నడకలో హావభావాల్లో కనపరిచేది.

'నర్తనశాల' నాటకంలో... 'సలలిత రాగ సుధారస సారం' సర్వకళామయ నాట్యవిలాసం... ఝణన ఝణన ఝణ నూపుర నాదం... భువిలో దివిలో రవళింపగా...' తెర వెనుక నుండి తను పాడుతుంటే తెరముందు నాట్యము సలపే నటరాయని ఆనందలీలా వినోదమే! ఆమె!!

'సారంగధర'లో చిత్రాంగిగా 'రాజులేనప్పుడు సారంగా నువ్వు రా... రాదా... పోరాదా?... సారంగా...' ఆమె పాడుతూ నాట్యం చేస్తూవుంటే ప్రతి పేక్షకుడు తననే ఆహ్వానిస్తుందేమోనని భ్రమించేవారు నిజానికి అలా భ్రమించిన వారిలో రాఘవాచార్యులు కూడా ఒకడు!

''ఇప్పుడేం కావాలి మా సంస్థానంలో స్థానం కావాలా?'' గత స్మృతుల నుండి తేరుకుని ప్రశ్నించాడు.

''వద్దు మాష్టారు. నేను 'కుంతి' పాత్రలు చేసి చేసి అలసిపోయాను. ఇప్పుడు ఆ పాత్రలో జీవించాలనుకుంటున్నాను. నా భర్త ద్వారా సంతానం పొందే అవకాశంలేదు. కూచిపూడి పితామహుడు సిద్దేంద్రయోగి లాంటి ఋషితుల్యులు మీరు. అత్యంత తపోనిష్ఠులైన మహర్షుల వీర్యం అమోఘం అని హరిదాసు చెపితే విన్నాను. కర్ణుడిలాంటి వీరుణ్ణి నే కోరుకోవటంలేదు. కనీసం మీలాంటి ఉత్తమ నాట్యాచార్యుల ద్వారా కళాకారుణ్ణి కనాలనుకుంటున్నాను. అందుకు నా కోరిక తీర్చమని వచ్చాను'' పాత్రోచితంగా పలికింది సుందరమ్మ.

## నానోలు

**తా**నే అల్లి
చిక్కుకుంది;
గూట్లో
సాలీడు!

బాల్యం
ఊహల్లో...
వార్థక్యం
గతంలో!

మనసుకు
దర్పణం
ముఖమే...
దాచలేవు!

అన్నీ కొన్నా!
సుఖం లేదా?
సంతృప్తిని
కొనలేవు!

విశ్వాన్ని
దర్శిస్తావు...
నీ గురించి
చెప్పలేవు!

ప్రార్థన
వాడితో మొర...
ధ్యానం
వినడం!

సంపదతో
అహంకారం
కలిస్తే
అగ్నికి ఆజ్యం!

ధనవాన్
దరిద్రుడు
తృప్తి భేదం
సరిహద్దు!

కొట్టి రామారావు

అనుకోని కోరికను విని అవాక్కైపోయాడు రాఘవాచారి. ఏకాంతంలో కార్యార్థియై వచ్చిన కాంత కోరికను అవుననలేక కాదనలేక సతమతమయ్యాడు. దివినుండి భువికేతెంచిన తేనెల వెన్నెల సొనలా వుందామె!

“ఇది శాస్త్ర సమ్మతమో అసమ్మతమో నాకు తెలీదు. ఇందుకు నా భర్త సమ్మతి పొందాను. ఈ కార్యంలో నా భర్త స్వార్థం కూడా వుంది. లోకం అతణ్ణి పురుషుడుగా గుర్తించాలి. నాకు పుత్రభిక్ష పెట్టండి” ఆయన కాళ్ళపై పడి అర్థించింది.

ఆమె అభ్యర్థన అర్థం చేసుకున్న మునిలాంటి నాట్యాచార్యులు మంచులా కరిగిపోయాడు. ఫలితంగా సుందరమ్మ ఆడ శిశువుకి జన్మనిచ్చింది.

విషయం తెలుసుకున్న రాఘవాచారి సుందరమ్మని పిలిపించి తన గౌరవ ప్రతిష్ఠలకు భంగం కలుగకుండా, ముమ్ముందు వారి అక్రమ సంతానం ఎవ్వరికి తెలీకుండా ఉండాలనే ఉద్దేశ్యంతో ఆమెకు కొంత డబ్బిచ్చి పట్నానికి వెళ్ళిపొమ్మని, పుట్టిన బిడ్డని ‘నృత్యకళాకారిణి’గా తీర్చిదిద్దమని చెప్పాడు.

వారి మాటలు శిరసావహించి పట్నానికి బయలుదేరింది సుందరమ్మ. కాని విధి వక్రించి ఆమె ప్రయాణం చేస్తున్న రైలు ప్రమాదానికి గురై భర్త మరణించాడు. యవ్వనం సొగసు వున్న సుందరమ్మ పసిబిడ్డతో వీధి భాగోతాలు చేస్తే తన బతుకు కూడా ‘వీధి భాగోతం’ అవుతుందని గ్రహించి నాటకాలకి స్వస్తి చెప్పి దర్జాగా దర్జీ వృత్తిని చేపట్టింది. ఆ వృత్తిలో ఆరితేరి డబ్బు సంపాదించి బిడ్డని చదివించింది. కొంత మంది దాతల ప్రోత్సాహంతో బిడ్డకి నృత్యం నేర్పించింది. నేడు ఆమె ప్రముఖ కూచిపూడి నృత్యకళాకారిణి కాత్యాయినిగా దేశవిదేశాల్లో మన్ననలను పొంది తెలుగు తల్లి కీర్తి కిరీటంలో కలికితురాయిగా విరాజిల్లుతోంది.

ఒకప్పటి పూరిగుడిసెలాంటి ఇల్లు. హైటెక్ సిటీలో ఇప్పుడు బంగ్లాగా మారింది. కార్లు, పిసిలు, సెల్‌ఫోన్లు మోడ్రన్ ఎక్విప్‌మెంట్స్‌తో, పదిమందికి కళను నేర్పి అన్నం పెట్టేస్థాయికి పెరిగిపోయింది. అనాలోచితంగా సుందరమ్మ కళ్ళు వర్షించాయి.

“అమ్మమ్మా... ఏంటీ ఏడుస్తున్నావా...?” అంటూ దగ్గర చేరింది అప్పుడే స్కూల్ నుంచి వచ్చిన నాలుగేళ్ళ కాత్యాయిని కూతురు కాదంబరి.

“లేదమ్మా... లేదు... మీ అమ్మ రేపటికల్లా వచ్చేస్తోంది. ఇప్పుడే ఫోన్లో మాట్లాడింది.ఇవిగో మమ్మీ ఫోటోలు” అంటూ లేజర్ జెట్లో తీసిన ప్రింట్స్‌ని చూపించింది మనువరాలకి సుందరమ్మ.

కాత్యాయిని నృత్యభంగిమలు వివిధ రూపాల్లో వున్నాయి. ఆ ఫోటోలు చూస్తూ మురిసిపోయారిద్దరు. ఒకర్ని ఒకరు కౌగిలించుకున్నారు, ముద్దుపెట్టుకున్నారు.

“ఏంటి... అమ్మమ్మా టీవిని ట్యూన్ చేయకుండానే చూస్తున్నావ్” అమ్మమ్మ చేతిలో రిమోట్ తీసుకుని వాల్యూమ్ రైజ్ చేసింది కాదంబరి.

టివిలో వార్తలు వస్తున్నాయి. ‘ఇప్పుడే అందిన వార్త!కాలిఫోర్నియా నుండి ఇండియాకు బయలుదే

## నానీలు!

పేద - గొప్ప
బేధం కనబడ్డంలా...
ఆకలి
అందర్నీ ఒక్కటి చేస్తుంటే...!

మనుషులకైనా...
పక్షులకైనా...
కడుపునిండాలంటే...
రెక్కాడాల్సిందే...!

రాయిని
ఆత్మీయంగా పలకరించా...
అదీ... మనిషై
మాట్లాడుతోంది...!

నీ మనసు
శిథిలమైందా...
ఆ పాపం...
ఖచ్చితంగా...
పుచ్చుకున్న వారిదే...!

ఎన్ని ఓటములైతే...
ఒక గెలుపో
ఎన్ని చావులు చూస్తే...
ఒక బ్రతుకో...!

పనసకర్ల

రిన విమానం ప్రమాదానికి గురైంది.ప్రమాదంలో సుమారు 40మంది సజీవ దహనం అయినట్లు, అందులో ప్రముఖ కూచిపూడి నర్తకిమణి కాత్యాయిని మరియు ఆమె భర్త కూడా మరణించినట్లు భారత రాయబారి కార్యాలయం వెల్లడించింది.'

వార్త విన్న సుందరమ్మ గుండెలో కోటి శతఘ్నులు పేలాయి!! ఆమె చేతిలోనున్న కూతురి ఫోటోలు గాలికి చెల్లాచెదురుగా ఎగిరిపోయాయి. కాదంబరిని దగ్గరగా తీసుకుని వెక్కి వెక్కి ఏడ్వసాగింది సుందరమ్మ.

"మీ అమ్మనాన్న నిన్ను అన్యాయం చేశారమ్మా... చనిపోయారు" ఆమె ఏడుపుతో చిన్నారి కాదంబరి శృతి కలిపింది.

'కాత్యాయిని నర్తకి విదేశాల్లో కూచిపూడి నృత్య ప్రదర్శనకై వెళ్ళివస్తున్నప్పుడు ఈ దుర్ఘటన జరిగింది. కాత్యాయిని తల్లికూడా ఒకప్పటి రంగస్థల నటి కావటం మరో విశేషం. చిన్ననాడె తండ్రిని కోల్పోయిన కాత్యాయిని పట్టుదలతో కూచిపూడి నృత్యాన్ని నేర్చుకున్నారు. తన అమ్మాయిని కూడా తనంతటి నర్తకిని చేయాలని ఆమె జీవితాశయం అని అమెరికా రాయబారి కార్యాలయంలో మీడియాకి ఫ్లైట్ ఎక్కేముందు వెల్లడించారు' టివిలో వార్తలు వస్తూనే ఉన్నాయి.

కాదంబరికి అమ్మ దగ్గరకంటే అమ్మమ్మ దగ్గిరే చేరికెక్కువ. పుట్టినప్పటి నుండి పసిపాప ఆలనా పాలనా సుందరమ్మే చూసుకునేది. తల్లి డ్యాన్స్ ప్రోగ్రామ్స్‌కి వెళ్ళినప్పుడు ట్రైనింగ్ క్లాసెస్ కండక్ట్ చేస్తున్నప్పుడు ఎంతో నిశితంగా పరిశీలించేది కాదంబరి. తల్లిని మించిన డ్యాన్సర్ కావాలనే ఆవ తపన ఆ కళ్ళల్లో మెరిసింది. అమ్మమ్మ రోదన విని ఏం చేయాలో తోచని కాదంబరి పక్కనే కప్‌బోర్డులోనున్న గజ్జెలు తీసుకుని కాళ్ళకి చుట్టుకుంది.

"ఏడవకు అమ్మమ్మా... నేను కూడా అమ్మని మించిన డ్యాన్సర్‌నవుతాను. ఈరోజు నుండి ఈ గజ్జెలు అమ్మ బట్టలు అన్నీ నావే..." అంటూ తన చిన్నారి చేతుల్తో ఆమెని చుట్టేసింది. ఆ చిన్నారి కళ్ళల్లో అంతులేని ఆర్తి! అంకితభావం!! స్పష్టంగా కనిపించాయి సుందరమ్మకి.

'మాష్టారి జీన్స్ మీ అమ్మలో, మీ అమ్మ జీన్స్ నీలో నిక్షిప్తమై ఉన్నంతకాలం ఈ కళకి చావులేదమ్మా... నిన్నొక మహా నర్తకిగా చేస్తాను, నీకోసమైనా నే జీవిస్తాను, మనసులోనే అనుకుని, సుందరమ్మ కాదంబరిని మరింత దగ్గర తీసుకుంది. ఆమె మనసు అందెల రవళులతో నిండిపోయింది. 'మళ్ళికూయవే గువ్వా... మోగిన అందెల మువ్వా, తుళ్ళి పాడవే పువ్వా... గుండెల సవ్వడి నువ్వా... విధివరమే నీవేగా నీవేగా... కలనిజమై పూచేగా పూచేగా... జిలిబిలి పలుకుల నువ్వా... దివిలో తారా జువ్వా... జువ్వా... జువ్వా...'ఆన్‌చేసివున్న టివి నుండి పాట వస్తూనే వుంది. ■

## హైకూలు

గదులికి
వింజామరలు
కర్టెన్లు!

సాకర్కే కాదు
సాపాటుక్కావాలి
'పుడ్డు' బాల్సు!

టీవి ఫ్రిజ్ గ్రైండర్, ఎ.సి
వగైరాల జాతక చక్రం
కరెంటు, రిపేరు బిల్లులు!

అలసట పోగొట్టే
పల్లె పదం పాడ్తోంది
శ్రామిక సుశీల!

ఆలికి
మిఠాయి పొట్లం
మూర పూలదండ!

తాళి
మెడలో
పసుపు పలుపు!

లాకుల తలుపులు
బార్లా ఎత్తేసారు
నీళ్ళుంటేగా?

పగలు రెస్టు
రాత్రి బిజీ బిజీ
దుప్పటికి!

ఇల్లంతా
అదో సువాసన
గదిలో బాలింత!

మాధవరపు కృష్ణ